# నిర్మల

★

రచన: జె. భాగ్యలక్ష్మి



"ఇలా జరుగుతుందని ఎవరనుకొన్నారు? పసివయస్సులో పచ్చగా కళకళలాడవలసిన మన బిడ్డలు మన ఎదుటే కష్టాలపాలు కావటం...మనం దాన్ని చూసి భరించటం........"

"పోనీలే దాన్నయినా చదువుకోనిద్దాం, కాస్త ఈ దుఃఖం మరచిపోతుంది, గోపాలానికి త్వరలోనే నయమవుతుందిలె, ఏడాదిపాటు మందులు విడవకుండా తీసికొంటే అన్నీ చక్కబడతాయి, ప్రస్తుతం శానిటోరియానికే పంపవలసి ఉంటుంది,"

"ఏదో హాయిగా ఈ వేసవిలో బావా మరదళ్ళిద్దరికీ పెళ్ళి చేసేద్దామనుకొన్నాము, వాడూ రేపో మాపో ఉద్యోగం వస్తుందని సంబరపడేవాడు, ఏమనుకొని ఏం లాభం విధి వక్రించిన తర్వాత,"

"ఇప్పుడు మాత్రం ఏమయిందిలే ఏడాది అవగా ఎంతలో గడుస్తుంది? టి, బి, వచ్చి బాగయినవాళ్ళెందరు లేరు, గోపాలానికి నయం కాగానే పెళ్ళి జరిపిస్తే సరి"

"ఇంకా నయం పిల్ల గొంతు కొయ్యమన్నావు కాదు, ఎంత నీ అన్నకొడుకయినా ఇటు నీ కన్నకూతురి జీవితం కూడా ఆలోచించు,"

"అయినవాళ్ళం మనమే వెనుకాడితే ఎలాగండీ, అది పుట్టినదాదిగా అనుకొంటూనే ఉన్నాం ఈ సంబంధం గురించి, ఈనాడు వానికి టి. బి. వచ్చిందని సంబంధాలు త్రెంచుకోగలమా?"

"నువ్వట్టే మాట్లాడకు. నిర్మలకు డాక్టరీ చదువాలని ఎంతగానో ఉంది. మనమే దాని పెళ్ళికోసమని చదువు వెనక్కి పెట్టాం. ఈ ఏడు కాలేజిలో చేరిపించేస్తాను. అది కాస్త చదువులోపడి ఈ విషయాలన్నీ మరచిపోయినతర్వాత తగిన సంబంధం చూచి చేసేద్దాం. మనకు మాత్రం ఎంతమంది ఉన్నారు? ఉన్న ఒక్క పిల్లనూ టి. బి. వానికి ఎలా అంటగట్టాం?

వెంకట్రామయ్య పంచె దులిపి భుజాన వేసుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు. వెనకగదిలో ఉండి తల్లిదండ్రుల మాటలు విన్న నిర్మల పరుగెత్తుకుంటూ వచ్చి తల్లిని చుట్టేసింది.

"ఏడవకు తల్లీ! ఏమయిందిప్పుడు? కాలేజిలో చేరి చదువుకో. బావకు నయమయ్యాక ఆ సంబంధమే నీకు కుదురుస్తాను. సరేనా? పిచ్చిపిల్లా ధైర్యంగా వుండాలి. నీ మనసు కష్టపెట్టామటమ్మా. మేము లేమా నీ కష్టసుఖాలు పంచుకోటానికి?"

♦

నిర్మలకు మెడికల్ కాలేజిలో చేరిన ఉత్సాహం

ఏమంత లేదనే చెప్పాలి. ఎప్పుడూ బావను గురించే ఆలోచించేది. అతనికి త్వరగా నయమయిపోవాలని దేవుణ్ణి ప్రార్థించేది. పాఠాల్లో ఎంత శ్రద్ధ తీసికోవాలనుకున్నా బావ తనకు మానసికంగా సహచరుడయిపోయాడు. గోపాలం తన ఆరోగ్యం గురించి వ్రాసే ఉత్తరాలు నిర్మలకు ధైర్యం కల్పించినప్పటికీ వాటిలో ప్రతిఫలించే నిరాశ తనను బాధపెట్టేది. "నువ్వు నా కేమీ కావు" అన్న ధోరణిలో నడిచే ఉత్తరాలకు లోలోపలే కుమిలిపోయేది. "అలా వ్రాయకు బావా, నన్ను పరాయి దాన్ని చేయకు" అని ఎన్నోసార్లు వ్రాసిందికూడ. కాని గోపాలం వ్రాసే ఉత్తరాల్లో ఆత్మీయత తొంగిచూడడం మానేసింది.

ఎప్పుడూ నిరాశగా, ఒంటరిగా ఉంటున్న నిర్మలను పలకరించాలనుకున్నాడు జార్జి. ఏదో పుస్తకం కావాలని ఆమెను అడిగాడు. ఆమె ఉలికిపడినట్లు చూసింది. "సారీ...మీరు నన్ను గుర్తుపట్టలేదా? మీ క్లాసులో ఉంటున్నాను జార్జిని"

"ఆ పుస్తకం హాస్టల్లో ఉంది."

"సాయంత్రం రమ్మంటారా?"

"మీ కెందుకు శ్రమ. రేపు నేనే తెచ్చియిస్తాను"

"బాగుంది నా పనికి నాకు శ్రమేమిటి? ఈ సాయంత్రం వస్తానులెండి, థ్యాంక్స్" అని వెళ్ళిపోయాడు.

సాయంత్రం హాస్టలుకు వచ్చిన జార్జిని ఆదరంగానే పలకరించింది నిర్మల. "క్షమించాలి ఆ పుస్తకాన్ని మా కుసుమ ఎక్కడో పెట్టేసింది. తనేమో సినిమాకు వెళ్ళింది."

"ఫర్వాలేదు లెండి. రేపు వచ్చి తీసుకొంటాను. అన్నట్టు మీ ఫ్రెండుతో మీ రెందుకు సినిమాకు వెళ్ళలేదు?"

"నాకు సినిమాలు అట్టే చూడాలని ఉండదండీ"

"అదృష్టవంతులు. నాలాంటివానికి వారానికి ఒక సినిమా అయినా చూడకపోతే తోచదు."

నిర్మల చిన్నగా నవ్వింది.

"మీ హాబీ ఏమిటండీ?"

"హాబీ... నాకు హాబీ ఏం లేదు. కాలేజి, హాస్టలు ఇంకో ధ్యాస లేదు"

"చిత్రంగా ఉందే. చదువులో ఎంత శ్రద్ధ ఉన్నా, ఇంత శ్రద్ధ పనికిరాదండోయ్"

చాలా మాటలకు నిర్మల సమాధానమే చెప్పలేదు. అన్నీ జార్జ్ మాట్లాడేస్తున్నాడు. ఒకగంటసేపు కూర్చుని ప్రపంచంలోని విషయాలన్నీ మాట్లాడిన తర్వాత "ఇక వస్తానండీ. రేపొకసారి వచ్చి ఆ పుస్తకం తీసికెళ్తాను." అని వెళ్ళిపోయాడు.

"జడివాన వెలిసింది' అనుకొంది నిర్మల.

"చాలా మాటకారి" అనికూడ అనుకొంది. "సెన్సాఫ్ హ్యూమరు చాలా ఉన్నట్టుంది" అనే అభిప్రాయం కూడ ఆమెకు కలిగింది.

ఆ మరునటిరోజూ అతను వచ్చాడు. ఏవేవో తన చిన్ననాటి కబుర్లు చెప్పి నవ్వించాడు. అతని మాటల్లోనే ఏదో శక్తి ఉంది. ఎదుటి వ్యక్తిని ఇట్టే ఆకట్టుకుంటాడు. "అతనితో నాకేమిటి?" అని నిర్మల ఎంతగానో తొలగిపోవాలనుకొంది. కాని జార్జి వదలలేదు. ఏదో ఒక సాకుతో ఆమెను కలుస్తూనే ఉన్నాడు. చివరకు అతని రాకపోకలు "ఫ్రెండ్లీ విజిట్సు" గా మారాయి.

గోపాలానికి వ్రాసిన ఉత్తరంలో ఒకసారి జార్జిని గురించి వ్రాసింది నిర్మల.

ఈ జబ్బు మనిషిని మరచిపోటానికి, మరపింపచేయటానికి మరో వ్యక్తి దొరికాడన్న మాట. "విష్ యు బెస్టాఫ్ లక్" అని సమాధానం వచ్చింది.

నిర్మలకు అతనిమీద కోపం వచ్చింది. ఏమిటి అతని

USE...
ALWAYS!!

GITA'S

BANIANS
For
DURABILITY
And
FOR THE
COMPETITIVE
RATES.

MFGRS

Phone : 899

GITA KNITTINGS
BRIDGEWAY COLONY :: TIRUPUR-2

ఉద్దేశ్యం? తానెప్పుడూ ఏకాకిగా, కుమిలిపోతూ ఒంటరిగానే బ్రతకాలా? ఎవరితోనూ ఏమాత్రం స్నేహంకూడ చేయకూడదా?

జార్జితో నిర్మల స్నేహం పెరిగింది, తన చీకటి మొహంలో నవ్వు కలిగింది, పదిమందితో కలివిడిగా తిరగటం నేర్చుకొంది, కనుక వాళ్ళంతా తనను బలే ఏడిపించేవారు.

“అబ్బో స్నేహితులంటేనే గిట్టదేమో అనుకొనే వాళ్ళం. ‘బాయ్ ఫ్రెండు’ కోసం ఇన్నాళ్ళూ ఎదురు చూసింతని ఎవరికి తెలుసు?”

నిర్మల నవ్వింది. ఏమీ మాట్లాడలేదు. జార్జి తనను దుఃఖాంధకారంనుండి వెలికి తెచ్చిన మాట నిజమే. బ్రతుకులోని గాలీ, వెలుతురు తనకు ప్రసాదించిన మాట నిజమే కాని అంతకుమించిన కర్తవ్యం తన కొకటి ఉంది. ......అది తన బావకు ఇల్లాలిగా మారటం అతని పాడి పాడి ఉత్తరాలు చూస్తుంటే కోపమొచ్చేది నిర్మలకు. పోనీలే జబ్బు మనిషి అతని ఊహాలు ఎన్ని వెర్రి తలలు వేస్తున్నాయో అని ఊరుకొనేది.

నిర్మల సెకండు ఇయరులో ఉండగా ఒకనాడు హఠాత్తుగా గోపాలంనుండి నిర్దాక్షిణ్యమైన ఉత్తరం వచ్చింది.

“......నాకు నయమయిపోయింది. ఇక్కడే లోకల్ కాలేజిలో లెక్చరరుగా ఉద్యోగంకూడ వచ్చింది, నా జబ్బులో నా కెంతో సేవచేసిన సుగుణను (నర్సు) పెళ్లి చేసుకొన్నాను, ఈ సంగతి ఇంట్లోవాళ్ళకుకూడా యీ రోజే వ్రాస్తున్నాను, నీవు జార్జితో బాగా కాలక్షేపం జరుగుతోందనుకుంటాను.

ఈ విషయం నిర్మలను ఎంతో బాధపెట్టింది, కనీసం మాటమాత్రంగానైనా బావ ఈ విషయం ముందే వ్రాసి ఉండొచ్చు, తన సుఖ దుఃఖాలతో అతనికేమీ పనిలే దన్నమాట, కన్నీళ్ళయినా కార్చలేనంత అశక్తత తనను అలముకొంది.

ఆ సాయంకాలం జార్జి పలకరించాడు, “ఈరోజు అదోలా వున్నావేమిటి నిర్మలా?”

నిర్మల ఇంతవరకు నొక్కిపెట్టిన దుఃఖం వెల్లువలా పైకి ఉబికింది, జార్జి ఎంతో అనునయించి అడిగాడు, కళ్ళు తుడుచుకొంటూ తన హేండ్ బ్యాగ్ లోని ఉత్తరం తీసి ఇచ్చింది.

“గోపాలం ఎవరు?” అని అడిగాడు, ఆ ఉత్తరం చదవటం ముగించి. ఇన్నాళ్ళూ వీరెంత కలిసి తిరిగినా వ్యక్తిగతమైన విషయాలు మాట్లాడుకొనేంత చొరవ ఏర్పడలేదు, ఈనాడు జార్జికి మించిన ఆత్మీయులెవరూ నిర్మలకు కనుపించలేదు, అందుకే మొదటినుండి అంతా వివరంగా చెప్పింది.

“నేనూ, బావా చిన్నప్పటినుండి కలిసి ఆడుకొన్నాం. కలిసి పెరిగాం, అతనికు నాకు ఏడేండ్లు తేడా ఉంది. నేను పి. యు. సి. పూర్తి చేసేసరికే తను యం. ఏ. పాసయ్యాడు ఆ వేసవిలో మా పెళ్ళి అవుతుందనుకొన్నాము ఇంతలో బావకు జ్వరం వచ్చింది, చివరికది టి. బి గా తేలింది. ఏడాదిపాటు శానిటోరియంలో





మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!

శాంతి డైమండ్స్

♦

రసాయనిక వజ్రాలను తయారించుటలో ప్రసిద్ధి చెందియున్నాము.

వివరములకు

బి. కె. ఎస్. కన్నన్ & బ్రదర్స్,

నెం. 37. పెద్ద సౌరాష్ట్ర వీధి : : తిరుచిరాపల్లి-8.

ఉండి వైద్యం చేయించుకోవాలని చెప్పారు డాక్టర్లు, దానితో నన్ను కాలేజీలో చేర్పించేశారు. బావను శానిటోరియంలో పెట్టారు ..'' కర్చీఫుతో కళ్లు, ముక్కు తుడుచుకొంది నిర్మల,

''ఓహో! అందుకా నీవంత దిగులుగా, ఏకాంతంగా ఉంటేదానివి? నిజం చెప్పొద్దూ నీమీద నా కెంతో జాలి వేసింది, నేను కావాలనే నీతో పరిచయం చేసికొన్నాను'' తెలుసా?

అంతదుఃఖంలోనూ నిర్మల నవ్వకుండా ఉండలేక పోయింది.

''ఇప్పుడేమిటి నీవిక భగ్నప్రేమికవా? జీవితమంతా మీ బావగారి స్మృతులతో గడిపేస్తావా? రోజుకో కడివెడు కన్నీళ్లు కార్చి మరో జన్మలోనైనా మీ బావకు నిన్ను ధర్మపత్నిగా చేయుమని భగవంతునితో మొర పెట్టుకొంటావా?'

''నీ హాస్యానికైనా అంతుండాలి జార్జ్, నా బాధ నీ కంత నవ్వుతాలుగా ఉందా?''

''లేదు నిర్మలా కోపం తెచ్చుకోకు, నేను చాలా ప్రాక్టికలు మనిషిని, ఈ సెంటిమెంట్లు, ఊరికే ఇదై పోవడం అంటే నాకు నచ్చదు, ఏ సమస్యకయినా పరిష్కారమంటూ ఉండకపోదు.

''ఈ సమస్యకు పరిష్కారముందంటావా?''

''ఇక్కడ సమస్య ఏముందసలు? మీ బావను పెళ్ళి చేసికోవాలనుకొన్నావు, అది కుదరలేదు, అతను ఇంకెవరినో పెళ్ళి చేసికొన్నాడు, కాబట్టి అతనిపై ఆశలు పెట్టుకోటంకూడ వ్యర్థమే నీకు వచ్చిన నష్టంమాత్రంఏముంది? హాయిగా నీ చదువు ముగించి నీకు నచ్చినవాణ్ణి చేసికో......''

''అంత సులభమా?''

''సులభమని కాదు. కాని కాలం ఏ గాయాలనయినా మాన్పుతుంది,'' కృతజ్ఞతతో అతనివైపు చూసింది,

''అఫ్‌కోర్స్ కాలేజీలో ఉన్నన్నాళ్ళూ నీ కష్టసుఖాలు నేను తప్పక పంచుకొంటాను, నన్ను నీ ఆప్తమిత్రునిగా భావించు. అదే చాలు......''

WECO

♦ చక్కని పరుగు.
♦ చిరకాల మన్నిక.
♦ ఖర్చులో తక్కువ.

మీ వ్యవసాయాభివృద్ధికి
మా పంపులను ఉపయోగించి
అధిక పంటలను
పండించండి.

● సెంట్రిఫ్యూగల్
● బెల్ట్ డ్రివన్ పంపులు
మరియు
విడి భాగములు



వివరములకు :

ఫోన్ :-82/206 P. P.     రెసిడెన్స్ :-32510 & 32866

వీకో ఇండస్ట్రీస్

పీలమేడు : : కోయంబత్తూరు-4

జార్జి ప్రోత్సాహంతో నిర్మల కాలేజీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనసాగింది. తెలీకుండానే ఇంకో రెండేండ్లు గడిచాయి, వీరిద్దరి స్నేహం ఇంకింత బలపడింది. అందరూ వీరిని కాబోయే దంపతులుగా భావించారు. కాని వీరిద్దరి మధ్య ఆ ప్రస్తావనే ఎన్నడూ రాలేదు, ఆ వేసవి సెలవులకు వెళ్తున్నప్పుడు జార్జి నిర్మలను ఈ విషయమై కదిపాడు.

"ఈ సెలవుల్లో నాకు పెళ్లి చెయ్యాలని ఇంట్లోవాళ్లు గట్టిగట్టి పట్టుతున్నారు" నిర్మల ఉలికిపడింది. తానెన్నడూ ఈ విషయమై ఆలోచించనేలేదు.

"ఏమంటావు?"

"నేనేమంటాను? నీకు తోచినట్లు చేయమంటాను."

"ఆమాత్రానికి నన్నెందుకు అడిగినట్లు? నిజం చెప్పు నిర్మలా నేనంటే నీకున్న భావమేమిటి? వ్యక్తిగా, ఆప్తునిగా నీకు తగనా? నాతో జీవితం పంచుకోవాలని నీకు లేదా?

"మరీ బాహాటంగా అడిగేస్తున్నావు"

"ఇందులో మొహమాట మెందుకు? నేను నీకు కొత్తవాణ్ణి కాదే. అందులో జీవితానికి సంబంధించిన ప్రశ్న యిది"

"మీ పెద్దలకు ఇది నచ్చుతుందా?"

"ఏది? మన పెళ్ళా? నచ్చదు. ఎలా నచ్చుతుందనుకొంటావు? మీవాళ్ళకూ నచ్చదు నాకు తెలుసు. కులాలేమిటి మతాలే వేరు. పెద్దవాళ్ళింకా ఈ సంకెళ్ళనుండి బయటపడలేదు మరి."

"వాళ్ళకు నచ్చని పెళ్లి చేసుకొని మనమేం సుఖపడుతాం? మన చదువులు మధ్యలో ఆగిపోతాయి. మనల్ని పోషించుకోటానికి ఏ చిన్న ఉద్యోగమూ దొరకదు. పైగా చుట్టూ ఉన్నవారు మనల్ని వెలివేసినట్లే చూస్తారు."

"అబ్బో...... సెంటిమెంట్సు వదిలి కాస్త ప్రాక్టికలుగా ఆలోచించమని నేనే నీకు చెప్పినట్లున్నాను కాని మరీ ఇంత ప్రాక్టికలుగా ఆలోచిస్తావనుకోలేదు. నీవు చెప్పిన ఇబ్బందులన్నీ ఉన్నాయి. కాని ఒకరికోసం

WECO

మోటార్లు-పంపులు
మరియు
మోనో బ్లాక్‌లు

♦ చక్కని పరుగు.
♦ చిరకాల మన్నిక.
♦ ఖర్చులో తక్కువ.

మా తయారింపులు :
* ఎలక్ట్రిక్ మోటారులు.
* సెంట్రిఫ్యూగల్ పంపులు
* డొమెస్టిక్ పంపులు.
* మోనోబ్లాక్ సెట్స్.



: వివరములకు :

గ్రామ్స్:-"టెర్మినల్స్"  ఫోన్ : ఆఫీసు—82/206.  రెసిడెన్స్—82510

వేక్‌ఫీల్డ్ ఇంజినీరింగ్ కంపెనీ

పీలమేడు [తపాలు పెట్టె, నెం 847] కోయంబత్తూరు-4

మరొకరు ఆమాత్రం రిస్క్ తీసుకోలేమా?" అతని కళ్లు ఆత్మవిశ్వాసంతో మెరుస్తున్నాయి.

"మన కష్టాలేకాదు జార్జి, మన తల్లిదండ్రుల విషయం కూడ ఆలోచించు. వాళ్ళు ఊరికే కుమిలిపోతారు. ముసలితనంలో వాళ్లకెందుకు బాధ కలిగించాలి చెప్పు. అందులో వాళ్ళ సంతానమంతా నేనే. నేనే వాళ్ళ కడుపులో చిచ్చు పెట్టి, దానిని చల్లార్చుకొనే మార్గం కూడ వారికిలేదు."

"నీవు అందరిగురించీ ఆలోచిస్తావు గాని నీగురించి ఆలోచించవు. అసలే ప్రబుద్ధులైన బావగారు పెళ్లిచేసేసుకొన్నారని ఒకఏడాదిపాటు నీలో నీవే కుమిలిపోయావు. ఇప్పుడు నీ మంచి చెడ్డలు తెలిసి నిన్ను ప్రేమించగల నన్నుకూడ ఎందుకు దూరం చేసుకొంటావు?"

నిర్మల కండ్లలో నీళ్ళు నిండాయి. "థాంక్యూ జార్జ్ ఫర్ యువర్ కన్‌సిడరేషన్. కాని నా కోసమని తెలిసీ తెలిసీ నీ వెందుకు కష్టాలపాలు కావాలి?"

"అయితే నే నింకెవర్ని చేసుకోనా నీకేం బాధ కలగదనేగా"

కళ్ళు క్రిందకు వాల్చేసింది.

"ఏం జరిగినా మనమధ్య ఈ స్నేహానుబంధాన్ని మాత్రం తెంపకు. సరేనా?"

సరేనని తల ఊపింది.

* * *

జార్జికి పెళ్ళయిన తర్వాతగాని నిర్మలకు అర్థంకాలేదు తానెంత పోగొట్టుకొన్నదీ. అతనితో మునుపటిలా మాట్లాడటానికి తిరగటానికి ఏదో అడ్డుకొన్నట్టయింది. క్రమక్రమంగా తిరిగి ఒంటరిదయింది. ఈ అగ్నిని ఆర్పేవాళ్ళెవరూ లేరేమోననిపించింది.

కనుమవాళ్ళు తనని ఓదార్చబోయారు "జార్జి నిన్నింత దగా చేస్తాడనుకోలేదు, నీతో తిరిగినన్నాళ్లూ తిరిగి ఇంచక్కా మరెవరినో పెళ్ళిచేసికొన్నాడు.

"అతనేం నన్ను దగాచేయలేదు"

"మరింకేమిటి?"

"ఉయ్ వర్ జస్ట్ ఫ్రెండ్స్......దట్సాల్"

"హు—ఫ్రెండ్స్, ఈలాంటి వాళ్ళని చాలామందిని చూశాం, పరిచయాలు వేరు, స్నేహాలు వేరు, కబుర్లెన్నయినా చెప్పొచ్చు, ప్రకృతి ఆకర్షణను కాదనలేం"

నీ సైకాలజీ జ్ఞానమంతా తెలియజేయవలసిన అవసరం లేదు, ఇది నా వ్యక్తిగత విషయం."

"సారీ",

ఇటు ఆడపిల్లలలోనూ నిర్మలకు స్నేహితులు కరవయ్యారు, పక్కపై పడుకొని ఎంతరాత్రయినా ఏడుస్తూ గడిపేది, ఒంటరితనం తనను నిలువునా దహించివేస్తోంది, హృదయపూర్వకంగా ఎవరితోనైనా మాట్లాడాలని, మనసులోని భావాలు ఇంకొకరితో పంచుకోవాలని ఎంతగానో ఉండేది, కాని తన వాళ్ళనుకొనేవారు ఎవరున్నారు? జీవితంలో ఒంటరితనం ఎంత భయంకరమైనదో, అదెంత చిత్రవధ చేస్తుందో నిర్మలకు అర్థమయింది. ఇంక తానా జ్వాలలు భరించలేని స్థితికి వచ్చింది, ప్రయత్నపూర్వకంగానైనా వాటినుండి బయటపడాలనుకొంది,

కళాశాల వార్షికోత్సవాలు దగ్గరపడుతున్నాయి, నిర్మల ఇంతకు ముందుకూడా డ్రామాల్లో ఆక్టుచేసింది, ఈసారి యూనియను సెక్రటరీ తనను అడిగాడు.

"ఒథెల్లో నాటకం వేస్తున్నాం, మీరు ఈసారి పెద్ద పాత్రే వహించవలసి ఉంటుంది మీరు సహకరిస్తారు కదూ"


మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!




వీనస్ నిట్టింగ్ కంపెనీ

తిరుపూరు (S.I.)

"నాకీమధ్య ఒంట్లో బాగులేదండీ" అని కొన్ని నెలలుగా ఆమెనుండి వస్తున్న సమాధానమే ఇప్పుడూ వస్తుందేమోనని అతను భయపడ్డాడు.

కాని నిర్మల ఒప్పుకొంది.

"సాయంత్రం ఒకసారి టౌన్ హాల్లో ఆక్టర్లందరూ కలుస్తున్నారు మీరూ రండి"

వస్తానని తలూపింది నిర్మల.

* * * *

ఒక ప్రక్కని చదువు, మరో ప్రక్కని నాటకం రిహార్సల్సు...... నిర్మలకు ఒంటరితనాన్ని గురించి దుఃఖపడే సమయమే దొరకలేదు. క్రమక్రమంగా ఆమె ఆలోచనల్లో రంగనాథం చోటుచేసుకోసాగాడు. అతను ఫైనలియర్ స్టూడెంటు, కాలేజీలో అతను పాల్గొనని ఫంక్షనంటూ లేదు, చక్కగా పాటలు పాడుతాడు, అతని ఇంగ్లీషు ఉచ్చారణ మనోజ్ఞంగా ఉంటుంది, అతను ఈ ఒథెల్లో నాటకంలో ఒథెల్లోగా వేస్తున్నాడు.

రిహార్సల్సు కోసం ఆలస్యమయ్యేది రోజూ వచ్చి హాస్టలు దగ్గర దిగబెట్టి వెళ్ళేవాడు ఎన్ని కబుర్లు చెబుతాడో! అతని పెదవులు నిండుగా నున్నితంగా ఉంటాయి తనని "నీలూ" అని చొరవగా పిలుస్తాడు, నిద్రపట్టేముందు 'నీలూ' అంటూ ఆ రోజు అతను చెప్పిన అన్ని కబుర్లూ నెమరేసుకొంటుంది, నిర్మల జీవితంలో అంతగా దుఃఖభారంతో క్రుంగిపోవలసిందేమీ లేదని, వెలుగురేఖలు ఎక్కడో ఒకచోట కానపడ్తాయనే భావం తనలో చిగురిస్తోంది.

వనుమాబృందం అనుకొంటున్న మాటలు తనను చాలా బాధపెట్టాయి.

"టెర్రిబుల్ గర్ల్ చూడటానికి అలాఉందిగాని బలే జాణ, ఎంత తేలిగ్గా బాయ్‌ఫ్రెండ్సును మార్చేస్తుంది! ఎవరివెంటో ఒకరివెంట తిరగకపోతే తనకు తోచదేమో! అదో హాబీ కాబోలు"

నిర్మలకు భోరున ఏడవాలనిపించింది. తను అంత తేలికతనానికి అలవాటుపడలేదని, తన జీవితం మొదటినుండి ఎండిపోతూనే వచ్చిందని ఏ కొంచెం వానకైనా అది చిగురిస్తే తన తప్పేమీ లేదని వారికి చెప్పాలనిపించింది. కాని ఆమెకు ఆ చొరవేదీ? చెప్పినా అర్థం చేసుకొనే సహృదయత ఎదుటివాళ్ళకు వుండొద్దూ?

* * * *

నాటకం చాలా బాగుందని అందరూ మెచ్చుకొన్నారు. తన నటన ముఖ్యంగా చివరిసీనులో చాలా సహజంగా ఉందన్నారు. అందులో తన గొప్ప ఏముంది? రంగనాథంది యాక్షనయితే తనది రియాక్షను మాత్రమే.


శుభవార్త

"ఎస్" బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్సు ఎ. హబీబుర్ రహమాన్ అండ్ సన్సు గుడియాత్తంవారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మని (లిప్‌జిగ్ ఫైర్) స్వీడన్, బెల్జియమ్, సింగపూర్ మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాల లోకూడా వీటిని ప్రవేశపెట్టారు. ఎస్. బీడీలకు వారుతయారు చేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టవంటి పాకెట్‌లో కొత్త రూపు, అందచందాలుకూడా ఏర్పడ్డాయి.

ఆద్య తన భవిష్యత్తులో అమెరికా యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని ఎస్. బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

పరీక్షలు హడావిడి ముగిసాక అందరూ వారి వారి ఇండ్లదారి పట్టారు. నిర్మలకు ఈ వీడ్కోలు ప్రాణసంకటంగా ఉంది. ఎలాగయినా రంగనాథంతో తన హృదయాన్ని విప్పిచెప్పాలనుకొంది. మొదటినుండి తానుతిన్న ఎదురుదెబ్బల గురించి చెప్పి, ఇంకేమాత్రం దెబ్బలు తట్టుకొనే శక్తి తన కిక లేదని తెలియజెయ్యాలనుకొంది.

ఆ సాయంత్రం అతనేదో హిందీ సినిమాకు రమ్మని పిలిచాడు. హాల్లో కూర్చున్నప్పుడు తను అడిగింది.

"ఇన్నాళ్లు చదివిన కాలేజిని, ఫ్రెండ్సును వదిలిపోవాలంటే బాధగా లేదూ'

"అఫ్‌కోర్సు...బాధ లేకపోవటానికి నేనేమీ రాతి మానవుణ్ణి కాదు"......లైట్లారిపోయాయి, ఏవో డాక్యుమెంటరీలు చూపిస్తున్నారు, అతని చేయి గట్టిగా పట్టుకొని "నా జీవితానికి తోడునీడగా ఉంటావా?' అని అడగాలనుకొంది నిర్మల. కాని ఆ అమ్మాయి భావాలు పరుగెత్తినంత వేగంగా మాటలు రావద్దూ.


సోరియాసిస్ (పొడల) చర్మవ్యాధికి
అత్యుత్తమమైన ఆయుర్వేదౌషధములు



మానవునికి ఏర్పడే 18 విధ మూలైన చర్మ రోగములలో 'సోరియాసిస్'అనే పొడ చర్మ రోగము అతి భయంకరమైనది. ఈ భయంకరమైన వ్యాధికి మా 'సోరియాసిస్' ఔషధములను ఉపయోగించిమీ వ్యాధిని తీర్చుకో కోరుతున్నాము.

సోరియా నివారిణి నెం. 1......రూ, 12-00.
సోరియా నివారిణి నెం. 2......రూ. 12-00.
సోరియా నివారిణి ములాము......రూ. 9-00.
,, (పై పూతకు) చిన్నసైజు...రూ, 5-00.
వివరములకు 25 పై. స్టాంపుతో వ్రాయండి.

శ్రీ కె. ఎన్. పండిట్, అర్. యం. పి,

వీరరత్న ఫార్మసి,

గ్రైన్ బజార్. బెంగుళూరు-2


సినిమా చూస్తూ ఏవేవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు రంగనాథం, ఇంటర్వెల్లులో కూల్ డ్రింక్స్ త్రాగారు, మరలా సినిమా మొదలయింది,

"నేను జ్ఞాపకం ఉంటానా?'' నెమ్మదిగా అడిగింది.

"నిన్ను మరచిపోవటమా? అదెలా సాధ్యం?

"యు ఆర్ మై డెస్టినేషన్ - ఐ విల్ ఆల్వేస్
రిమెంబర్ యూ యాజ్ డెస్టినేషన్......,,

"అంతే......,,"

"అంతేకాదు నీలూ, నీవు వంటి స్నేహితురాలివి, నిన్నెన్నటికీ మరచిపోను, నిన్ను మా ఊరికి తప్పక తీసికెడతాను. ఈ వేసవిలోనే నా పెళ్ళి, ముందుగా నేనే వచ్చి నిన్ను తీసుకెళతాను, ఏ పరిస్థితుల మూలంగానైనా నేను రాలేకపోతే నీవు నన్ను దగా చేయకు, నీవు రాకపోతే చాలా బాధపడ్తాను,

అది రంగనాథం గొంతే, తాను మురిసిపోయే వేణునాదం వంటి స్వరమే, అతని సుకుమారమైన పెదవులే ఈ మాటల్ని ఉచ్చరిస్తున్నాయి, తన ప్రేమను యీ ఒక్షిల్లో నిర్దాక్షిణ్యంగా బలిగొంటున్నాడు,

"ఏం మాట్లాడవేం',

"అలాగే'' వస్తున్న ఏడుపు నాపుకోటానికి వృధా ప్రయత్నం చేసింది.

"అదేమిటి నీలూ సినిమా చూసి అంతగా ఏడవాలా? ఎంత సెంటిమెంటలిస్టువు నీవు! నయం ఎవరయినా చూస్తే మనమిద్దరం దెబ్బలాడుకొన్నా మనుకోగలరు''

నిర్మల అతిప్రయత్నంమీద చిరునవ్వు నవ్వింది.

* * * *

నిర్మల గుండెల్లో అగ్నిపర్వతం బ్రద్దలవుతోంది, పైకి చెప్పుకోలేని బాధ' చెప్పుకోటానికిమాత్రం ఎవరున్నారని? రంగనాథానికి వీడ్కోలివ్వటానికి స్టేషనుకు వెళ్ళింది. స్నేహంగా ఆమె చెయ్యి నొక్కి "నా పెళ్ళికి తప్పక రావాలిసుమా' అని మరీ మరీ చెప్పాడు.

రైలు భయంకరంగా కూత పెట్టి కదిలింది, కన్నీళ్ళతో చెయ్యి ఊపుతూనే ఉంది నిర్మల. తనలోని పిడికెడు ప్రాణాలూ అనంతవాయువులో కలిసిపోతే బాగుండునని పించింది, తన జలాశయాలన్నీ మరీ చిక్కవుతుంటే తన పిపాస తీరేదెప్పుడు? రైలు చప్పుడు దూరంగా సాగింది, నిట్టూర్చి నిర్మల వెనక్కు మళ్ళింది.

★